## కలెక్టర్‌కు వినతి

భైంసా, మే 26 : నిర్మల్ జిల్లా భైంసాలోని 133లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు చేశారని సోమవారం కలెక్టర్‌కు పలువురు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందులో ప్రమేయం ఉన్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ బీజేపీ పట్టణాధ్యక్షుడు రావుల రాము, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు రావుల పోశెట్టి, సాహెబ్ రావు, అనిల్ ఉన్నారు.

## విత్తనాల సందడి షురూ

బోథ్, మే 26 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో విత్తనాల సందడి మొదలైంది. సోమవారం బోథ్‌లోని విత్తనాల దుకాణాల్లో అన్నదాతలు విత్తనాలు కొనుగోలు చేయడం కనిపించింది. మృగశిర కార్తె సమీపిస్తుండడం ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. పత్తి సోయా, కంది, మక్క, పెసర విత్తనాలతోపాటు రసాయన ఎరువుల బస్తాలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. బోథ్‌లోని పలు షాపుల వద్ద రైతుల సందడి కనిపించింది.

## ప్రతి ఎకరాకు నీరందాలి

ఉట్నూర్ రూరల్, మే 26 : చెరువు కింద సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు నీరందాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అనారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం బిర్సాయిపేట్‌లోని చెరువుకు రూ.18 లక్షలు, దంతన్‌పల్లిలోని చెరువుకు రూ.25లక్షలతో మరమ్మతులు చేయుటకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, చంద్రయ్య, ఖయ్యూం, అజీమ్, ఎక్బాల్, భీమన్న, లింగన్న, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్ రూరల్, మే 26: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు మగ్గం వర్క్‌లో ఇస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహ్మద్ గౌస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు గల పదో తరగతి పాస్ లేదా ఫెల్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, బస్సు చార్జీలు, రెండు జతల యునిఫామ్, టూల్ కిట్‌తో పాటు శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాలకు చెందిన మహిళలు 10 వతరగతి మెమో, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్, 4 పాస్ ఫొటోలతో జూన్ 1వ తేదీలోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 2 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇతర వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు 9949412159, 8985633226, 9441530494, 8096093085 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

బజార్‌హత్నూర్, మే 26 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకంలో భాగంగా రైతులు రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో కృష్ణపాల్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలోని రైతు వేదికలో గిర్నూర్, పిప్పిరి, వర్తమన్నూర్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రెవెన్యూ పట్టపాస్‌బుక్ ఉన్న రైతులు తప్పని సరిగా రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, మే 26 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి వర్షిణి తెలిపారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించలేని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18–25 ఏళ్ల వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి రోజూ మూడు గంటలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 7036826353 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏవో రమేశ్ కుమార్

ఇచ్చోడ, మే 26 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రమేశ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో విత్తనాల దుకాణాలు తనిఖీ చేశారు. విత్తన నమూనాలు సేకరించారు. వీటి నాణ్యత ప్రమాణాల కోసం (విత్తన మొలక శాతం, స్వచ్ఛత, తేమ శాతం) విత్తన పరీక్ష కేంద్రం, బీటీ జన్యువు ప్రోటీన్ నాణ్యత శాతం కోసం హైదరాబాద్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. విత్తనాల స్టాక్ నిల్వలను రైతులకు పూర్తి వివరాలు, రైతు సంతకం (లాట్ నంబర్, ఎమ్మార్పీ తయారీ తేదీ, గడువు తేదీ)తో ఇస్తున్నారా అని పరిశీలించారు. ఆయన వెంట విత్తన దుకాణాల యజమానులు, రైతులు ఉన్నారు.

## ఆపరేటర్లు పోల్స్ చార్జీలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఈ జేఆర్ చౌహాన్

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని డిష్, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్లు పోల్స్ చార్జీలు వెంటనే చెల్లించాలని ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్( కన్‌స్ట్రక్షన్) జేఆర్ చౌహాన్ సూచించారు. సోమవారం ఆదిలాబాద్‌లోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో డిష్, కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలపై తమ కేబుళ్లను ఇష్టానుసారంగా కట్టవద్దని దీంతో ప్రమాదాలు జరుగుతాయన్నారు. వైర్లను ఒక దగ్గర కట్టగా కట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో డిష్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్లు తము వినియోగిస్తున్న కరెంట్ స్తంభాల వివరాలు సమర్పించాలన్నారు. విద్యుత్ స్తంభాలపై వైర్లను వేలాడదీస్తూ, చార్జీలు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## నేటితో జొన్నల కొనుగోలు కేంద్రం బంద్

ఇంద్రవెల్లి, మే 26: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నుంచి బంద్ చేస్తున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరమ్‌సింగ్, చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే ఒక ప్రకటనలో తెలిపారు. జొన్న పంటను అమ్మకానికి తీసుకురావద్దని, తీసుకువచ్చిన కొనుగోలు చేయమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మండల రైతులు గమనించాలని కోరారు.

## 29 నుండి జొన్నల కొనుగోలు నిలిపివేత

బోథ్, మే 26 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు ఈ నెల 29వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోపు మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

# ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- నేరడిగొండలో ఆకలి కేక పోస్టర్ విడుదల



నేరడిగొండ : పోస్టర్ విడుదల చేస్తున్న ఆవిష్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని ఆయన నివాసంలో ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న 'ఆటో ఆకలి కేకలు మహాసభ'కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.5 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయనే మాట్లాడుతూ రోజువారి కష్టంతో జీవనం నెట్టుకుంటున్న ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ పార్టీ మోసపూరితంగా వాడుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తామని, వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ తరపున పోరాడుతామని భరోసా ఇచ్చారు. ఇక్కడ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు ఉన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన రాయిపెల్లి సుదర్శన్‌కు రూ.14వేలు, షేక్ శబానకు రూ.60వేలు, తాంసి మండలం కప్పర్లకు చెందిన పద్మకు రూ.28,500, జోగి మొగ్గ భగవాండ్లకు రూ.12వేలు, బోథ్ మండలం కుచులాపూర్‌కు చెందిన కొక్కుల హర్షవర్ధన్‌కు రూ.25,500, నేరడిగొండ మండలం బోరిగాంకు చెందిన జాదవ్ శిల్పకు రూ.60వేలు, ఇచ్చోడ మండలం దేవుల్‌నాయక్‌తండాకు చెందిన రాథోడ్ ఆనంద్‌రావ్‌కు రూ.50వేలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరయ్యాయి. సోమవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ స్వామి, పెంటన్న, రోహిదాస్, రాథోడ్ ప్రవీణ్, మహేందర్, రఫీ, భూషణ్, అనిల్, అర్జున్ పాల్గొన్నారు.

తాంసి(భీంపూర్), మే 26: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పెద్దింటి భూమన్నకు సోమవారం ఆయన ఇంటి వద్దే రూ.42 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ నాయకుడు షేక్ అఫ్రోజ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూమన్న, ఉదయ్ పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

దిలావర్‌పూర్, మే 26 : ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కోతలు లేకండా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏలాల చిన్నరెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ విధమైన షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని అన్నారు. దిలావర్‌పూర్ మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ఒక క్వింటాల్ ధాన్యానికి 7కిలోలు రైతు వద్ద నుంచి కట్ చేస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. హమాలీల పేరుతో రైతుల వద్ద నుంచి కేంద్రం నిర్వాహకులు అడ్డగోలుగా డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. లోలం, దిలావర్‌పూర్, కాల్వ, బన్సపల్లి గ్రామాల్లో ఒక క్వింటాల్‌కు హమాలీ పేరుతో రైతు వద్ద నుంచి రూ.50 తీసుకుంటున్నారని తెలిపారు. త్వరలోనే రైతులకు జరుగుతున్న అన్యాయాలపై పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ అశోక్, శ్రీనివాస్, రాజు, గంగారెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

## మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్ టౌన్, మే 26: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన వెడ్మ అనసూయ కుటుంబ సమస్యలతో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు ఐటీ కోర్ నిర్మల్ వారు ఇచ్చిన లోకేషన్ ఆధారంగా ఆమెను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ రాహుల్ తెలిపారు.

## విద్యుత్ ఇంజినీర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న మహగాం గ్రామస్తులు

భైంసా, మే 26 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మహగాం గ్రామంలో కరెంట్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు సబ్ స్టేషన్‌లో ఇంజినీర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంట్ సమస్యతో జంపర్లు పాడవడం, అంతేగాకుండా హెల్పర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక్కడ రాజశేఖర్, కృష్ణ, నగేశ్, విశ్వనాథ్, సంతోష్, మహేందర్, సాయినాథ్, భోజన్న ఉన్నారు.

# బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేస్తున్న వడగాం గ్రామ పటేల్ ఆత్రం మారుపటేల్

ఇంద్రవెల్లి, మే 26: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని వడగాం గ్రామం మీదుగా ఉన్న రింగ్ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారిందని, రోడ్డు నిర్మాణానికి మంజూరైన నిధులతో పనులు చేపట్టాలని గ్రామపటేల్ ఆత్రం మారుపటేల్ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి నుంచి వడగాం గ్రామ మీదుగా ఉన్న రింగ్ రోడ్డుకు అనుబందంగా 20గ్రామాలు ఉన్నాయని తెలిపారు. రోడ్డుకు అడుగుడగున గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు చేయడంతో పాటు వాహనదారులు, ద్విచక్ర వాహనలు, ఆటోలు నడపడానికి ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. వడగాంకు 108 అంబులెన్స్‌లు సమయానికి చేరడం లేదని తెలిపారు. ఇక్కడ ఆదివాసీ గిరిజనులు ఉన్నారు.

# ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచండి



నిర్మల్ డీఈవోకు తీర్మాన ప్రతులు అందజేస్తున్న గ్రామస్తులు

కుభీర్, మే 23 : ప్రభుత్వ బడులపై ప్రజల్లో సన్నగిల్లిన నమ్మకాన్ని తిరిగి నిలబెట్టేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. సోమవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పల్సి ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి త్వరలో ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమ సన్నద్ధత, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలు తీరుపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. పాఠశాలలో పోషకులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఉచిత పాఠ్య పుస్తకాల అందజేత, యూనిఫాంలను అందిస్తున్న విషయాలను నమోదు సందర్భంగా వివరించాలని అన్నారు. పోషకుల సూచనలు, సలహాలు స్వీకరించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారిని సత్కరించి అభినందించారు. ఇక్కడ సీఎంవో ప్రవీణ్ కుమార్, సరళ, సీఆర్పీ బాలేరావు గంగాధర్, మాజీ సర్పంచ్ కొట్టె హన్మాండ్లు, రాజ్‌కిరణ్, పబ్బు ధర్మపురి గ్రామస్తులున్నారు.

## ఫిర్యాదును పరిష్కరించాలి



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 26 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే, పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన ప్రతి ఒక్క ఫిర్యాదును కచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సిబ్బందికి ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 40 మంది ఫిర్యాదుదారులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

# వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 26 : ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి లో 123 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# సర్వేయర్ల శిక్షణకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్ జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం సోమవారం టీటీడీసీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. ఈ ప్రక్రియలో పలువురు అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన అభ్యర్థులకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు.. మెడికల్ సర్టిఫికెట్ కూడా అడగడంతో వారు వివిధ డాక్టర్ల వద్ద నుంచి మెడికల్ సర్టిఫికెట్లను తీసుకువచ్చారు. కానీ అవి చెల్లవని కేవలం సివిల్ సర్జన్ డాక్టర్ సంతకంతో తీసుకువచ్చిన సర్టిఫికెట్ మాత్రమే చెల్లుతుందని అధికారులు తెల్పి చెప్పారు. ఈ శిక్షణలో అభ్యర్థుల కోసం వసతి, భోజన సదుపాయం కల్పిస్తే బాగుంటుందని పలువురు అభ్యర్థులు కోరారు. శిక్షణలో అభ్యర్థులకు వసతి, భోజనం లాంటి ఏర్పాట్ల గురించి ఇంకా స్పష్టత రాలేదని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తెలిపారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ఎదులాపురం, మే 26 : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్లూరి గ్రామ శివారులో సోమవారం పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.28,140 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపలనే ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల వరకు రూరల్ పోలీసులు, సీసీఎస్ బృందం కలిసి దాడులు చేశారని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రూరల్ పోలీస్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

బజార్‌హత్నూర్, మే 26: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని చందునాయక్ తండా గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రంగులు వేయాడానికి మహారాజ్‌గంజ్ జిల్లా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కూలీలు కొందరు వచ్చారు. సోమవారం పాఠశాలకు రంగులు వేస్తున్న క్రమంలో సోన్ అనే వ్యక్తికి తల భాగంలో విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. తోటి కూలీలు గమనించి మండల కేంద్రంలోని దవాఖానకు తరలించి చికిత్స అందించారు. పెను ప్రమాదం తప్పడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యాధికారి శిల్ప జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేశారు.

## మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

నిర్మల్ చైన్‌గేట్, మే 26: దుబాయిలో హౌజ్ కీపింగ్ పని ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.63 వేలు తీసుకుని వేరే పని ఇప్పించి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిర్మల్ పట్టణం కురన్నపేట్‌కు చెందిన ఆకారపు శివశంకర్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. నిర్మల్‌కు చెందిన ఏజంట్ గోవర్ధన్ తన వద్ద నుంచి రూ.63 వేలు తీసుకుని దుబాయిలో హౌజ్‌కీపింగ్ పని ఇప్పిస్తానని చెప్పి అక్కడ వేరే పని ఇప్పించాడు. అక్కడ ఆ పని కష్టంగా ఉండడంతో పని చేయలేని పరిస్థితిలో తన భార్య రూ. లక్ష అప్పు తీసుకుని పంపిస్తే ఇండియాకు తిరిగి వచ్చినట్లు తెలిపారు. తను ఆర్థికంగా నష్టపోయానని తనను మోసం చేసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భైంసా, మే 26 : నిర్మల్ జిల్లా భైంసాలోని పిప్రి కాలనీకి చెందిన యువకుడు లక్ష్మణ్ (32) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసకున్నాడు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ మద్యానికి బానిసై రూమ్‌లో ఉరేకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఖానాపూర్ రూరల్, మే 26 :నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నీరాటి రాహుల్ (19) తమ స్నేహితుడు జక్కుల కార్తిక్‌తో కలిసి జగిత్యాల జిల్లా మల్లాపూర్ శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. ఆదివారం రాత్రి 11: 30గంటలకు తిరిగి వెళ్లే క్రమంలో రాహుల్ అతివేగంగా బైక్ నడపడంతో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో రాహుల్ మృతి చెందాడు. తండ్రి నీరాటి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా టౌన్, మే 26: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏఎస్పీ అవినాశ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ ఎస్పీ ఆదేశాల మేరకు భైంసా మండలంలోని మీర్జాపూర్‌లో ఏఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నైలు, ఎస్ఐలు సుప్రియ, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై దృష్టి సారించండి

కుభీర్, మే 26 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు చేపట్టడం కంటే ముందు అవి మార్కెట్‌లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని నిగ్వ గ్రామంలో ఆయన మాట్లాడారు. పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న సందర్భంలో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయన్న వదంతులను తిప్పికొటేందుకు విజిలెన్స్ పోలీసు అధికారులతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వానకాలం సాగుకు సరిపోయే విధంగా ఎరువులు స్టాక్ నిల్వచేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ దొంతుల దేవీదాస్, రైతులు ఉన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందన

నిర్మల్ అర్బన్, మే 26 : రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన నిర్మల్ బాక్సర్లు అభినయ, కీర్తనను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం అభినందించారు. వీరు జూన్ 4 నుంచి 7వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి జూనియర్ అండర్–17 బాల బాలికల పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారని జాతీయ స్థాయిలో రాష్ట్రం పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

దస్తురాబాద్, మే 26 : ప్రజలకు అందుబాటులో ఉండి, కార్యాలయానికి వచ్చే వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో సోమవారం య అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ల జారీలో జాప్యం ఉండవద్దని సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐలు ఆర్తీ, రచన, సిబ్బంది పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు ఇంటర్వ్యూలు

నిర్మల్ అర్బన్, మే 26 : నిర్మల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ కార్యాలయంలో సోమవారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు సోమవారం ఏడీ సుదర్శన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## అనుమతులు లేని విత్తనాలు అమ్మద్దు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ రవి కుమార్

భైంసా, మే 26 : అనుమతులు లేని విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ రవి కుమార్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా భైంసాలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విత్తన షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు విక్రయించేటప్పుడు రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, ప్రతి డీలర్ విత్తన స్టాకును ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో చూపించాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్న విషయం తెలిసిన వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, వైస్ చైర్మన్ ఫారుఖ్ హైమద్, విత్తన డీలర్ల షాపుల యజమానులు పాల్గొన్నారు.

## డబ్బులు వసూలు చేసిన నిందితుడు అరెస్ట్

ఉట్నూర్, మే 24: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తిని ఐదు లక్షల రూపాయలు డిమాండ్ చేసి మూడు లక్షలు వసూలు చేసిన నైతం బాలుని పోలీసులు అరెస్టు చేసినట్లు ఉట్నూర్ సీఐ మొగిళి తెలిపారు.చట్టాలలో ఉన్న లొసుగులను వినియోగించి అమాయకులపై కేసులు పెట్టి డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. ఇంద్రవెల్లి మండలం ధనోరా గ్రామానికి చెందిన బాధితుడు మాణిక్‌చంద్ ఇచ్చిన ఫిర్యాదుపై తలమడుగు మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన నైతం బాలు ఐదు లక్షల రూపాయలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. మాణిక్‌చంద్ ఇంటి నిర్మాణ సమయంలో ఎల్‌టీఆర్ కేసు పెడుతానని బెదిరించి, కేసును వాపస్ చేసేందుకు మూడు లక్షల రూపాయలు తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుడితో పాటు బిపిన్ కుమార్, మెస్రం ఆనంద్‌రావ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ సీఐ తెలిపారు.

## దొంగ అరెస్టు రిమాండ్

ఎదులాపురం, మే 26: జల్సాలకు అలవాటుపడతూ దొంగతనాలకు అలవాటు పడిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో మంగళ బబ్బిలి బాయికి చెందిన కిరాణా దుకాణంలో ఈ నెల 15వ తేదీన దొంగతనం జరిగింది. రూ.7500 నగదు, రెండు తులాల వెండి పట్టీలు దొంగతనమైనట్లు ఫిర్యాదు చేసింది. భగత్ సింగ్ కాలనీలో తనిఖీలు చేసే సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సిండి అక్షయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నాడు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది బుక్

భైంసా, మే, 26 : గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులను బుక్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కర్రోల్ల బుచ్చయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి కాపీలకు అవకాశం లేదని, విద్యార్థులు ఇది గమనించి ఎటువంటి చిట్టీలను కాని, మెటీరియల్లను కాని తీసుకరాకూడదని సూచించారు.